క్లుప్తంగా

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: జి.మామిడాడ చాంబర్ ఆఫ్ కామర్స్ 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అనపర్తిలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వర్తకులకు ఏ సమస్య వచ్చిన తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు డి.వెంకటరెడ్డి, ప్రతినిధులు కర్రి శ్రీనివాసరెడ్డి, మేడపాటి తాతారెడ్డి, కర్రి రామారెడ్డి, తాడి వెంకటరెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆడుదాం ఆంధ్రా క్రీడలు ప్రారంభం

పెదపూడి: మండలంలోని 18 గ్రామాల్లో మంగళవారం ఉదయం ఆడుదాం ఆంధ్రప్రదేశ్ ఆటల పోటీలు ప్రారంభించనున్నట్లు ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పెదపూడిలో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. అనంతరం మండల, నియోజకవర్గ స్థాయిలో పోటీలు జరుగుతాయని చెప్పారు.

సహకారం అందించిన వారికి సత్కారం



కమిటీ సభ్యులను సత్కరిస్తున్న మురళీకృష్ణారెడ్డి

బిక్కవోలు: షష్ఠి ఉత్సవాలను పురస్కరించుకుని గత వారం రోజులుగా సహకారం అందించిన కమిటీ సభ్యులను బిక్కవోలులో ఆలయం వద్ద షష్ఠి ఉత్సవ కమిటీ చైర్మన్, గ్రామ ఉపసర్పంచ్ డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉత్సవాలను విజయవంతానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బిక్కవోలు శ్రీలక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, గువ్వల సత్తిరెడ్డి, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

సీతానగరం: రాపాక గ్రామానికి చెందిన కోమలి అనంతలక్ష్మి బంగారు ఆభరణాలు మాయమైన ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై కె.చిరంజీవి సోమవారం తెలిపారు. అనంతలక్ష్మి ఈనెల 23న ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలను బ్యాగులో పెట్టుకుని రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ వద్ద ఆటో ఎక్కి రాపాక వచ్చింది. అనంతరం బ్యాగులో చూడగా ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్ర

రాజానగరం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి నియోజకవర్గంలో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ప్రారంభం కానున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా దివాన్‌చెరువులో ఈ పోటీలను ప్రారంభిస్తారని ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలో ప్రారంభమయ్యే ఈ పోటీలు జనవరి 9 వరకు, మండల స్థాయిలో జనవరి 10 నుంచి 23 వరకు, నియోజకవర్గ స్థాయిలో 24 నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. అలాగే జిల్లా స్థాయిలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి వరకు, రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు నిర్వహిస్తారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా రాజానగరం



కార్యక్రమంలో పాల్గొన్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ పునర్నిర్మాణంలో సోమవారం వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమం, తదితర పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షతో పనిచేస్తున్నట్టు తెలిపారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: చీపురపల్లి పంచాయతీ పరిధిలోని అచ్చయ్యపాలేనికి చెందిన జూదే అరవాలను పాత గొడవల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన గిల్లి హరికృష్ణ, పీతా వీరబాబు కర్రలతో దాడి చేశారు. గాయపడిన అరవాలు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు సోమవారం తెలిపారు.

పశుపోషణ.. జాగ్రత్తలే రక్షణ

- శీతాకాలంలో వ్యాధుల గాలం
- పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ఏపీత్రయంలో గేదెకు చికిత్స చేస్తున్న పశువైద్య గ్రామ సహాయకుడు గణేష్



దూడకు చికిత్స చేస్తున్న పశు వైద్య సహాయకులు

పెదపూడి: చలికాలం.. వ్యాధుల కాలం. ఈ సీజన్‌లో పశువులకు వ్యాధులు సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉంటోంది. పాడి రైతులు ముందస్తు జాగ్రత్తలతో పశువులను సంరక్షించుకోవచ్చు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాలు ఉన్నాయి. ఆయా చోట్లసుమారు 80,657 గేదెలు, 32,420 ఆవులు పెంచుతున్నాయి. గొర్రెలు 14,023, మేకలు 15,070 ఉన్నాయి. వ్యాధులు సోకిన వెంటనే తగిన వైద్యం అందిస్తే పశువులను కాపాడుకోవచ్చని మండల పశువైద్యాధికారి సయ్యద్ గౌసియాసోని సూచించారు. సీజనల్ వ్యాధులు, సంరక్షణ చర్యలను ఆమె వివరించారు. అవి ఇలా..

గొంతువాపు వస్తే..

పశువుల్లో గురక లేక గొంతు వాపు వ్యాధి బ్యాక్టీరియా సూక్ష్మ జీవి కారణంగా వస్తుంది. పశువులకు గడ్డం కింద వాపు, కళ్లు ఎర్రపడడం, ముక్కు నుంచి జీర కారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది. దీని నివారణకు సల్ఫాడిమిడిన్, ఇంటాసెట్రాజ్ అనే మందులు వాడితే ఫలితం ఉంటుంది. ముందస్తు టీకాలు వేయించడంతో వ్యాధి రాకుండా అరికట్టవచ్చు.

గాలికుంటు వ్యాధి

పికార్నో వైరస్‌తో పశువుల్లో గాలికుంటు వ్యాధి సంక్రమిస్తుంది. గిట్టలు ఉన్న పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. నోటి, కాళ్లలో పుండ్లు ఏర్పడి పశువులు నడవలేకపోతాయి. దీని నివారణకు ప్రత్యేకించి గాలికుంటు టీకాలు ఆరు నెలలకొకసారి వేయించాలి. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. గిట్టల మధ్యలోని పుండ్లను పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేయాలి. బీస్ప్రేపెన్ అనే మందు 2.5 గ్రాములు, ఎన్రోఫ్లాక్సిన్ 50 ఎంఎల్ మందు వాడటంతో పాటు వేప నూనె రాయడం వల్ల ఫలితం ఉంటుంది.

తిరుగుడు రోగం..

రక్తంలోని ట్రిపనోజోమా పరన్న జీవుల కారణంగా పశువుల్లో తిరుగుడు రోగం సంక్రమిస్తుంది. ఇది అన్ని రకాల పశువులకు వచ్చే అవకాశం ఉంది. బెరేనిల్, త్రిక్విన్, పెరిటాస్ మందులు వాడితే ఫలితం ఉంటుంది.

ఇలా చేస్తే మంచిది

కాలానికి అనుగుణంగా పశువులకు ఆహారాన్ని అందించి పరిశుభ్రత వాతావరణంలో ఉంచాలి. శీతాకాలం ప్రారంభం నుంచే పశువులకు అధిక చలి నుంచి రక్షణ ఏర్పాట్లు చేయాలి. ఈ కాలంలో పశువులకు దాణాను కాస్త ఆలస్యంగా ఇవ్వాలి. నట్టల నివారణ మందులు ముందస్తుగా తాగించాలి. ఎఫ్ఎండీ, హెచ్ఎస్, బీ.క్యూ టీకాలు తప్పనిసరిగా వేయించాలి. పశువుల పాకలను సూర్యరశ్మి పడే విధంగా ఏర్పాటు చేసుకోవాలి.



టీకాలు వేయించాలి

పశువుల పెంపకంలో ముందస్తు జాగ్రత్తతోనే సంరక్షణ సాధ్యమవుతుంది. వేసవి కాలం నుంచే పశువులకు టీకాలు వేయించాలి. డాక్టర్ల సలహాల మేరకే మందులు వాడాలి. పాడి రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పెదపూడి మండలంలో ఆవులు 2,160, గేదెలు 10,445, గొర్రెలు 19, మేకలు 542 ఉన్నాయి.

– సయ్యద్ గౌసియా సోని, మండల పశువైద్యాధికారి, పెదపూడి

తొర్రిగడ్డ నుంచి సాగునీరు విడుదల



తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి విడుదలవుతున్న నీరు

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి సోమవారం సాగునీరు విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, నాయకులు ముదునూరి రామకృష్ణంరాజు, గద్దె వీరన్నబాబు, చింతలపూడి ముత్యాలరావు, జజ్జువరపు నాని, కూచిపూడి నాగేశ్వరరావు ముందుగా మోటార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం రెండు మోటార్ల స్విచ్‌లు ఆన్‌చేసి, 150 క్యూసెక్కుల నీరు వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు సాగునీటి ఎద్దడి కలగలేదని, పుష్కలంగా సాగునీరు అందుతోందన్నారు. దీనితో రైతులు పంటలను చక్కగా పండించుకుంటున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రెండో పంటకు నీరు అందించాలంటే ఎకరానికి కొంత నగదు వసూలు చేసేవారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌కు నెల రోజుల ముందుగానే సాగునీటిని అందిస్తున్నారని, ఈ ఏడాదీ ఆయన ఆదేశాల మేరకు రెండో పంటకు సాగునీరు విడుదల చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జలవనరులశాఖ జేఈ శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పచ్చ పురుగు నివారణకు చర్యలు



చంద్రేడులో పురుగుల నివారణకు శనగ పంటపై మందు పిచికారీ చేస్తున్న రైతు

రంగంపేట: శనగ సాగులో లేత మొక్కలపై ఆశించే పచ్చ పురుగు నివారణకు రైతులు మందులు పిచికారీ చేస్తున్నారు. మండలంలో రంగంపేట, వడిశలేరు, చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లోని రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన సుమారు 55 టన్నుల శనగ విత్తనాలను సుమారు 1500 ఎకరాల్లో సాగు చేశారు. ఇప్పుడిప్పుడే పొలాల్లో శనగ మొలకలు వస్తున్నాయి. అయితే లేత మొక్కలపై పచ్చ పురుగు ఆశించే అవకాశం ఉందని ముందు జాగ్రత్త చర్యగా నివారణ మందులు పిచికారీ చేస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు క్లోరోఫైరిఫాస్ లీటరు నీటిలో 1.2 ఎంఎల్ కలిపి పిచికారీ చేస్తున్నామంటున్నారు. శనగ పంట ప్రస్తుతం ఆశాజనకంగానే ఉందని, వాతావరణం అనుకూలిస్తే ఈ ఏడాది మంచి దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం



కాలిపోయిన తాటాకిల్లు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధి నాగరత్నం కాలనీలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. దాసరి సత్యనారాయణ, దాసరి వెంకన్న కుటుంబాలు నివాసముంటున్న తాటాకింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ఇంటిలోని మహిళలు బయటకు కేకలు వేస్తూ పరుగులు తీశారు. స్థానికులు అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన అగ్నిమాపక శకటం మంటలను అదుపు చేసింది. తండ్రీకొడుకులు తమ ఇంటి పైకప్పు రేకులు వేయడానికి తెచ్చిన రూ.2 లక్షల నగదు, ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలు పూర్తిగా కాలిపోయాయి. టీవీలు, ఫ్యాన్లు, ఫ్రిజ్, వంట సామగ్రి, దుస్తులు బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న వీఆర్వో బాబూరావు సంఘటనా స్థలానికి చేరుకుని, తక్షణ సాయంగా బియ్యం, కంది పప్పు అందించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మట్టా శ్రీనివాస్ బాధితులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందిజేశారు. ఈ ప్రమాదంలో రూ.20 లక్షల ఆస్తినష్టం జరిగిందని అంచనా.

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం



వెదుళ్లపల్లిలో బీజేపీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

సీతానగరం: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయమని నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి అన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా సోమవారం వెదుళ్లపల్లిలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాంబేలపు బాలయోగి, సాదే శ్రీను, మండల అధ్యక్షులు గూడపాటి జయరామ్, సత్యం రామకృష్ణ, నరేష్, సాయి పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఏపీఆర్ చౌదరి మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రధానిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. తొలుత జెండాను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో నీరుకొండ వీరన్నచౌదరి, నాయకులు టి.గణపతి, పి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

ప్రత్యర్థి పార్టీల తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి



వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులకు ఐడీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను సోషల్ మీడియా వేదికగా తిప్పికొట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులకు ఐడీ కార్డులు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సుపరిపాలన, పాలన విజయాలపై సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా కష్టపడి పనిచేసి గతంలో కంటే ఎక్కువ మెజార్టీతో పార్టీని గెలిచేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లు పాల్గొన్నారు.

వీరుళ్ళమ్మ జాతరకు పందిరి రాట ముహూర్తం



పందిరి రాటను ఏర్పాటు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

స్థానిక గ్రామదేవత శ్రీవీరుళ్ళమ్మ అమ్మవారి జాతర, తీర్థ కార్యక్రమాలకు సంబంధించి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరి రాటను ఏర్పాటు చేశారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏటా ఐదు రోజుల పాటు అమ్మవారి జాతర, తీర్థ కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వేదపండితులు ఈశ్వరశర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులతో ముందుగా ప్రత్యేక పూజలు జరిపించిన అనంతరం పందిరి రాట ముహూర్తం నిర్వహించారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నేషనల్ వెంకటరెడ్డి, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, ఏజీపీ వెలగల లక్ష్మీనారాయణరెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహనబాలకృష్ణారెడ్డి, గుంటూరు శ్రీను, సత్తి రామకృష్ణారెడ్డి, పడాల కల్యాణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేదిక ప్రారంభం

మండలంలోని పొలమూరులో వేంచేసివున్న శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామివారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేదికను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన మల్లిడి రామారెడ్డి, వినూష దంపతులు రూ.4.50 లక్షల ఆర్థిక సాయంతో ఈ కల్యాణ వేదికను నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి దాతల సాయం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన స్వామివారి నిత్యమాస కల్యాణంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, సత్తి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామతత్వాన్ని పూర్తిగా గ్రహించిన సుమిత్ర



సామవేదం షణ్ముఖశర్మ దంపతులను సత్కరించిన దృశ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రామతత్వాన్ని పూర్తిగా గ్రహించిన వారిలో లక్ష్మణుని తల్లి సుమిత్ర ఒకరని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. సోమవారం హిందూ సమాజంలో ఆయన తన ప్రవచనాన్ని కొనసాగించారు. రామతత్వం తెలిసినదే కనుక రాముని వెంట లక్ష్మణుని మరో ఆలోచన లేకుండా సుమిత్ర పంపింది. అంతే కాదు, రాముని తల్లి కౌసల్యను సాంత్వన వచనాలతో ఓదార్చింది. రాముడు అపరాజితుడు, ఆయన వెంట ఉన్న సీతాదేవి సాక్షాత్తు లక్ష్మీదేవి అని చెప్పింది. అయోధ్యా వాసులు రాముని రథం వెనుక వస్తున్నారు. వారిలో వేదవేత్తలు ఉన్నారు. వారిని చూసి రాముడు రథం దిగి నమస్కరించాడు. భరతుడు వయసులో బాలుడే కాని, జ్ఞానవృద్ధుడు. నాపై చూపుతున్న ఆదరాభిమానాలు భరతునిపై చూపమని రాముడు వారిని కోరతాడు. రాముని మాటలు విన్న అయోధ్యావాసులు రథాన్ని అనుసరించడం మానరు. తుదకు వారు నిద్రిస్తున్న సమయంలో రాముడు సీతా లక్ష్మణులతో కలసి తరలివెళతాడు. రాముడు లేకుండా తిరిగి వచ్చిన అయోధ్యా వాసులను వారి భార్యలు మందలిస్తారు అని సామవేదం తెలిపారు.

అలరించిన బాలల నాటకం

స్థానిక హిందూసమాజంలో సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనాల ఆధారంగా రూపొందించిన సంపూర్ణ రామాయణం నాటకాన్ని సోమవారం దేశ విదేశాల్లో ఉన్న బాలకళాకారులు ప్రదర్శించారు. ముందుగా భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు మాట్లాడుతూ అవాల్మీకాలకు తావు లేకుండా నాటకం ప్రదర్శితమవుతుందన్నారు.

మానవాళి రక్షణకే ఏసుక్రీస్తు జననం

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



పశ్చిమగానుగూడెం చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు



సీతానగరం ఇవాంజికల్ లూథరన్ చర్చిలో చిన్నారుల నృత్యాలు



గుమ్మళ్లదొడ్డిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు

రాజానగరం: ఏసుక్రీస్తు జననం మానవాళి విముక్తికి మార్గమని పెంతుకోస్తు సంఘం దేవారాధన మందిరం వ్యవస్థాపకుడు జి.ఏసురత్నం అన్నారు. రాజానగరం మండలం తూర్పుగానుగూడెం, సూర్యారావుపేట గ్రామాల్లోని పెంతుకోస్తు దైవారాధన మందిరాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వాక్యసందేశాన్నిచ్చిన ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలను అనుసరించాలని, ఆ మార్గంలో పయనించాలన్నారు. క్రిస్మస్ సందర్భంగా చిన్నారుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాస్టర్లు సుధాకర్ పాల్, జోసఫ్ ఫ్రాన్సిస్, సియోను, రాజానగరం సర్పంచ్ కుందేటి ప్రసాద్, స్థానిక నాయకులు దొండపాటి లాజరు, జి.సరోజిని, సునీత పాల్, జోయస్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేడుకలు

సీతానగరం: ప్రేమ, త్యాగం, కరుణను ఏసుప్రభువు ప్రపంచానికి అందించారని ఇవాంజికల్ లూథరన్ చర్చి పాస్టర్ అజరయ్య అన్నారు. సీతానగరంలోని ఇవాంజికల్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అజరయ్య మాట్లాడుతూ మానవాళి రక్షణ కోసం ఏసు ప్రభువు మానవునిగా జన్మించారన్నారు. అనంతరం వివిధ నాటికలు, నృత్యాలు ప్రదర్శించారు. అలాగే మండలంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. బూరుగుపూడి లూథరన్ చర్చిలో పాస్టర్ ఇశ్రాయేలు వాక్యసందేశాన్నిచ్చారు. మానవుల పాపానికి దూరం చేయడానికే ఏసుక్రీస్తు మానవుడిగా పుట్టారన్నారు. దైవకుమారుడు పశువుల పాకలో పుట్టడం. జ్ఞానులకు దర్శనం ఎంతో ప్రత్యేకమైనదన్నారు. శ్రీరంగపట్నం, కోటికేశవరం, రాఘవపురం, బొల్లెద్దుపాలెం, గరగలంపాలెం గ్రామాల్లో క్రిస్మస్ ఘనంగా జరిగింది. కోటికేశవరంలో సర్పంచ్ ముడే సింధూ దివ్య మాట్లాడుతూ ఏసు చూపిన మార్గం ఆచరణీయమన్నారు. కార్యక్రమాల్లో సంఘ పెద్దలు ముడే కామేష్, కొవ్వాడ రాజు, జల్లూరి రాజు, శ్రీను పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో క్రిస్మస్ సంబరాలు

పెదపూడి: మండలంలో ప్రధానంగా పెదపూడి, దోమాడ, కరకుదురు, రామేశ్వరం, ఏపీత్రయం, జి.మామిడాడ, పెద్దాడ, సంపర, కాండ్రేగుల, పైన, పుట్టకొండ, రాజుపాలెం, చింతపల్లి, వేండ్ర, శహపురం, కుమారప్రియం తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి, క్రీస్తు పుట్టుకపై సందేశాన్ని ఉపదేశించారు. చర్చిలను విద్యుత్ అలంకరణలతో సుందరంగా అలంకరించారు. కొవ్వొత్తులు వెలిగించి బాల ఏసు జననంపై గీతాలు ఆలపించారు. పాస్టర్లు కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. అనంతరం చిన్నారులు, యువత ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

గోకవరం: మండల వ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. గోకవరంలోని సేయింట్ జాన్స్ లూథరన్ చర్చ్, కృష్ణునిపాలెంలోని ఈహెచ్‌హెచ్ చర్చ్‌ల్లో ఉదయం నుంచి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డిలో పాస్టర్ కత్తి అబ్రహం ఆధ్యక్షతన చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

అనపర్తి: క్రీస్తు బోధనలు సార్వజనీనమైనవని, దేవునిపై భక్తి, విశ్వాసం, విధేయతలతో ప్రతీఒక్కరూ జీవించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం వివిధ చర్చిల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. క్రీస్తు బోధనలు ప్రతీఒక్కరికీ జ్ఞానమార్గాలని, క్రీస్తు మార్గాన్ని అనుసరించి తోటివారికి సహాయపడంతో పాటు సమాజహితానికి ప్రతీఒక్కరూ పాటుపడాలని ఆకాంక్షించారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు క్రీస్తు జీవితంలోని ఘట్టాలను వివరిస్తూ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామ్రాట్‌కు అక్కినేని పురస్కారం



జూనియర్ అక్కినేని సామ్రాట్‌కు పురస్కారం అందజేస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహానటుడు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలలో భాగంగా మూడో కార్యక్రమం సోమవారం జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై దొండపాటి సత్యంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అక్కినేని వీరాభిమాని అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో అక్కినేని పురస్కారాన్ని ప్రముఖ కళాకారుడు, జూనియర్ అక్కినేని సామ్రాట్‌కు ప్రముఖ నట, గాయకులు జిత్‌మోహన్‌మిత్ర చేతుల మీదుగా అందించారు. ముందుగా అక్కినేని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు, డీవీవీఎస్ నారాయణ, గిడ్డి నరసింహమూర్తి, ముద్రగడ ఏసుబాబు, బి.సీతారామారావు, సుక్కిరెడ్డి శ్రీనివాస్, వి.జగపతి, శేష గిరిరావు, టి.శ్రీనివాస్, లక్ష్మీతులసి పాల్గొన్నారు.